'నువ్వు మోక్ష మార్గంలో వున్నావా? ఐతే నన్ను ఓ సారి వెనక్కి తిప్పి ఏం రాసి వుందో చదువు'

శిష్యుడు ఆసక్తిగా ఒంగి ఆ రాతిని వెనక్కి తిప్పాడు. అక్కడ ఇలా రాసి వుంది.

'నీ గురువు చెప్పింది నీకు చాలన్న సంగతి గుర్తు లేదా? ఇంకేదైనా మిగిలి వుందని ఎందుకు అనుకుంటున్నావు?'

ఆధ్యాత్మిక సాధకుడికి గురువు మాటల మీద నమ్మకం ముఖ్యం.

## 59. గజ్జి కుక్క

ఓ మహాత్ముడు ఓ గ్రామానికి చాతుర్మాస దీక్ష కోసం వచ్చాడు. ఆయన్ని మంత్ర దీక్ష ఇవ్వమని చాలామంది అడిగితే ఆయన దానికి నిరాకరిస్తూ చెప్పాడు.

"ఆత్మ సాక్షాత్కారం పొందిన పరిపూర్ణ మహాత్ములే ఆ పని చెయ్యాలి. మీకన్నా ఆధ్మాత్మిక జ్ఞానం నాకు ఎక్కువ వుండచ్చు కాని మనమంతా వేరు వేరు తరగతుల్లో చదువుకునే విద్యార్థుల్లాంటివారం. ఇంకా చెప్పాలంటే మనమంతా సాటి ఆధ్యాత్మిక ప్రయాణీకులం. కాబట్టి అందుకు నాకు అర్హత లేదు. ఉందనుకుని మీకు గురువుగా వ్యవహరిస్తే వచ్చే జన్మలో ఎలా పుడతానో చెప్పలేను. అది ఖచ్చితంగా మనుష్య జన్మ అవదు."

నిత్యం ఓ గజ్జి కుక్క కూడా వచ్చి ఆయన చెప్పే ప్రవచనాన్ని వినేది. నాలుగు నెలలు దీక్ష అయేసరికి చిత్రంగా ఆ గజ్జి కుక్కకి వున్న గజ్జి ఎలాంటి మందు లేకుండానే పూర్తిగా పోయింది. ఆఖరి రోజు గ్రామస్థుల్లోని ఆసక్తి గల కొందరు ఆ గజ్జికుక్కకి ఆయన ప్రవచనాలు వినడం వల్లే ఆ గజ్జి పోయిందా అని ఆయన్ని అడిగారు.

"అవును." జవాబు చెప్పాడు ఆయన.

"ఎలా పోయింది?"

"దైవ సంబంధమైన ఏ పని చేసినా అది మన కర్మని నివారిస్తుంది. ప్రతిరోజూ వచ్చి సత్సంగంలో పాల్గొని దేవుడికి సంబంధించిన విషయాలని

శ్రద్ధగా విన్నది కాబట్టి. అది పుణ్య కార్యం కావడంతో ఆ కుక్కకి వచ్చిన గజ్జి పోయింది." వివరించాడాయన.

"అసలు దానికి అది ఎందుకు వచ్చింది?"

"గత జన్మలో అది అనేకమంది శిష్యులని చేరదీసి వారికి మంత్ర దీక్షని ప్రసాదించింది. బదులుగా వారి నించి అర్హతలేని పాద నమస్కారాలని, బహుమతులని, ధనాన్ని, సేవని స్వీకరించింది. ఆ పాపానికి దీనికి గజ్జి వ్యాధి వచ్చింది. ఆ శిష్యులంతా గజ్జి పురుగులుగా దీని శరీరాన్ని ఆశ్రయించి తమ బాకీని వసూలు చేసుకున్నారు." వివరించాడు గురువు.

## 60. తమది కానిది

ఓ తత్త్వవేత్త భార్య గర్భవతైంది. కొద్ది నెలలకి ఆమెకి పండంటి బిడ్డ పుట్టాడు. కొడుకుని చూసి తన భార్యతో ఆయన చెప్పాడు.

"వీడ్ని జాగ్రత్తగా పెంచు. అంతేకాని నీ వాడు అనుకోకు. ఎవరో జాగ్రత్త చేయమని ఇచ్చారని గుర్తుంచుకో."

తన భర్త ఆలోచనా పంథా మీద గౌరవం గల ఆమె తన కొడుకుని ఆయన మాటలని అక్షరాలా శిరసావహించి అలాగే పెంచింది. కొడుక్కి ఇరవై ఏళ్ళు నిండాయి. ఓ రోజు పొలంలో పని చేసి వచ్చాక అతను ఒంట్లో నలతగా వుందని పడుకున్నాడు. అతని రోగం ఎన్ని మందులు వేసినా తగ్గలేదు. చివరకి అతను ఓ రోజు మరణించాడు.

తీర్థయాత్రలకి వెళ్ళి తిరిగి వచ్చిన తన భర్తతో చెప్పింది అతని భార్య.

"ఓ సారి ఆ దుప్పటిని ఎత్తి చూడండి."

ఆ తత్త్వవేత్త భార్య చెప్పినట్లు చేస్తే మరణించిన కొడుకు కనపడ్డాడు.

"వీడ్ని మనకి జాగ్రత్తగా చూడమని అప్పగించిన వాళ్ళు తిరిగి వాడ్ని తీసుకువెళ్ళి పోయారన్నమాట." చెప్పాడు.

"అవునండి. మన బాధ్యత తీరింది."

కొడుకు పోయినందుకు ఆ దంపతులు ఇద్దరికీ దుఃఖం లేదు.